గంజాయి, మాదకద్రవ్యాలపై అవగాహన

కాసిపేట : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి నిర్మూలన, అవగాహన కోసమే విద్యార్థులతో కూడిన ప్రహరి క్లబ్ (యాంటీ డ్రగ్స్ కమిటీ)లని వివరించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజన్న, ప్రిన్సిపాల్ శంకర్, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



దేవాపూర్ పోలీస్ ఆధ్వర్యంలో...

మండలంలోని కొండాపూర్ యాపలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనపై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-సారంగాపూర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, డాక్టర్ వేదాస్ అన్నారు. మండలంలోని స్వర్ణ గ్రామంలోని ముస్లిం కాలనీలో సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న విషయం తెలుసుకొని బుధవారం వైద్య బృందం ఇంటికి వెళ్లి చికిత్స అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కాలనీవాసులకు సూచించారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్య పనులు రోజువారీగా చేపట్టాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు.



ప్రయివేట్ ఆస్పత్రుల ఛీట్‌మెంట్..!

- మంచిర్యాల నుండి కరీంనగర్‌కు రోగుల తరలింపు
- అంబులెన్స్ డ్రైవర్లకు లక్షల్లో ఎర
- రోగుల సంఖ్య ను బట్టి బుల్లెట్ బండి, ఐ ఫోన్ గిఫ్ట్‌లు
- భారమంతా పేషంట్స్‌పైనే

అక్రమ సంపాదనకు అలవాటు పడ్డ కొందరు ప్రయివేట్ హాస్పిటల్స్ నిర్వాహకులు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కాసులకు కక్కుర్తి పడి హాస్పిటల్స్ నిర్వహిస్తున్న తీరు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అంబులెన్స్ డ్రైవర్లను ఎరగా చేసుకొని వారు చేస్తున్న దందాతో తాజాగా ఓ నిండు ప్రాణం బలైంది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జిల్లాకు చెందిన యువకుడి కేస్ స్టడిని ఆధారం చేసుకొని మంచిర్యాల పోలీసులు విచారణ చేపట్టారు. ఇందులో అంబులెన్స్ డ్రైవర్‌లు, ప్రయివేట్ హాస్పిటల్స్ నిర్వాహకులు కలిసి చేస్తున్న ఈ దందాతో జిల్లా పోలీస్ యంత్రాంగం కదిలింది. అంబులెన్స్ డ్రైవర్‌లపై, కరీంనగర్, మంచిర్యాలకు చెందిన ప్రయివేట్ హాస్పిటల్స్‌పై నిఘా పెట్టింది.




మంచిర్యాలలోని ప్రభుత్వ హాస్పిటల్ పక్క లైన్‌లో నిలిపిన అంబులెన్స్‌లు

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలో మొత్తం 53 ప్రయివేట్ అంబులెన్స్‌లు ఉండగా, వాటి ఓనర్లు , డ్రైవర్లు కలిపి సుమారు 100 మంది వరకు ఉన్నారు. జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చిన రోగులను కరీంనగర్, హైదరాబాద్, వరంగల్‌కు తరలించేందుకు అంబులెన్స్ డ్రైవర్‌లు అంతా కలిసి యూనియన్‌గా ఏర్పడి పాయింట్ల విధానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పాయింట్ విధానంతో రోజుకొకరు ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చే రోగులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోగులను తరలించే క్రమంలో అంబులెన్స్ డ్రైవర్‌కు ప్రయివేట్ ఆస్పత్రి నిర్వాహకులు ఎర వేస్తున్నారు. ఒక్కో పాయింట్‌ను రూ.15000 నుండి రూ.30,000 ఇచ్చి హాస్పిటల్స్ నిర్వాహకులు అంబులెన్స్ డ్రైవర్‌లను కొంటున్నారు. ఎవరైతే ఎక్కువ శాతం డబ్బులు చెల్లించి పాయింట్ కొంటున్నారో ఆ ప్రయివేట్ హాస్పిటల్‌కు ఆ రోజు ప్రభుత్వ హాస్పిటల్ నుండి వచ్చిన కేసులను అంబులెన్స్ డ్రైవర్ తరలించాలని నిబంధన. ఇలా ఇష్టానుసారం డబ్బులు పెట్టి ప్రయివేట్ హాస్పిటల్స్ నిర్వాహకులు అంబులెన్స్ పాయింట్లను కొంటున్న తీరుతో అంబులెన్స్ డ్రైవర్‌లు చెలరేగిపోతున్నారు. సులభంగా డబ్బులు రావడంతో పాయింట్ల విషయం పక్కన పెట్టి ప్రభుత్వ, ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగుల కుటుంబ సభ్యులకు మాయ మాటలు చెప్పి వారిని బుట్టలో పడేస్తున్నారు. అనంతరం వారికి ఎవరు ఎక్కువ శాతం కమీషన్ ఇస్తారో ఆ హాస్పిటల్‌కు తీసుకెళ్లి రోగులను అడ్మిట్ చేస్తున్నారు. కరీంనగర్‌తో పాటు మంచిర్యాలకు చెందిన కొన్ని ప్రయివేట్ ఆస్పత్రుల నిర్వాహకులు పెద్ద మొత్తంలో పాయింట్లను కొనడంతో పాటు అంబులెన్స్ డ్రైవర్‌లకు నగదుతో పాటు గిఫ్ట్‌లు ఇస్తూ రోగులను వారి హాస్పిటల్స్‌కు తరలించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిరొంచ, మహారాష్ట్ర ప్రాంతాల నుండి మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్‌కు రోగులు పెద్ద మొత్తంలో తరలి వస్తుంటారు. మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ హాస్పిటల్స్‌కు వెళ్లే క్రమంలో అంబులెన్స్ డ్రైవర్లు రోగులను క్యాచ్ చేసుకుంటున్నారు. కరీంనగర్, మంచిర్యాలలోని ప్రయివేట్ హాస్పిటల్ నిర్వాహకులు ఇస్తున్న కమీషన్‌లకు కక్కుర్తిపడి రోగులను తరలించేందుకు యత్నిస్తున్నారు. అంబులెన్స్ డ్రైవర్లకు కమీషన్‌లు ఇవ్వాల్సి ఉండడంతో ప్రయివేట్ ఆస్పత్రి నిర్వాహకులు ఆ భారమంతా రోగులపైనే వేస్తున్నారు. తమ వారిని కాపాడుకోవడానికి చాలా మంది ఆస్తులు, బంగారం అమ్ముకొని లక్షల రూపాయలు హాస్పిటల్స్ బిల్లులు కడుతున్నారు. కరీంనగర్‌కు చెందిన కొన్ని ప్రముఖ హాస్పిటల్స్ నిర్వాహకులు నిత్యం మంచిర్యాలలోని అంబులెన్స్ డ్రైవర్లకు లక్షల్లో ముట్టజెబుతున్నారనే ఆరోపణలున్నాయి. 10 మంది అంబులెన్స్ డ్రైవర్లకు కలిపి రూ.10లక్షల అడ్వాన్స్, నెలలో 15 కేసులు తీసుకొస్తే బుల్లెట్ బైక్, 10 కేసులు తీసుకొస్తే ఐ ఫోన్ గిఫ్ట్‌లు ఇస్తూ రోగులను తరలించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతే కాకుండా వారే అంబులెన్స్‌లను కొనుగోలు చేసి మంచిర్యాలలోని కొన్ని ప్రయివేట్ హాస్పిటల్స్‌కు అప్పజెప్తున్నారు. వాటిలో వెళ్తే ఫ్రీ అని చెప్పి రోగులను తరలిస్తున్నారు. కానీ అక్కడికెళ్లిన తర్వాత బిల్లులు మాత్రం అధికంగా ఉంటున్నాయి. ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఓ ప్రయివేట్ హాస్పిటల్ నిర్వాహకులు పెద్ద ఎత్తున పేషెంట్‌లను తరలించిన మంచిర్యాలకు చెందిన ఓ అంబులెన్స్ డ్రైవర్‌కు ఎక్స్ యువి 500 వాహనాన్ని కొనిచ్చినట్లు చర్చ సాగుతోంది. ఇటీవల ఓ అంబులెన్స్ నిర్వాహకుడిపై పట్టణంలోని ప్రయివేట్ హాస్పిటల్ డాక్టర్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి హాస్పిటల్‌కు వచ్చిన పేషెంట్‌లకు మాయ మాటలు చెప్పి వేరే హాస్పిటల్స్‌కు తరలిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు అంబులెన్స్ యజమానిని పిలిచి మందలించి వదిలేశారు.



కరీంనగర్‌లోని ప్రయివేట్ హాస్పిటల్ నిర్వాహకుడు ఓ అంబులెన్స్ డ్రైవర్‌కు ఫోన్ పే ద్వారా పంపిన కమీషన్ డబ్బులు

జైపూర్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడికి రెండు నెలల క్రితం ఆక్సిడెంట్ అయింది. గమనించిన మంచిర్యాలకు చెందిన ఓ అంబులెన్స్ డ్రైవర్ కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు యువకుడిని తరలించాడు. అక్కడ వారం రోజుల చికిత్సకు రూ.5లక్షలు బిల్ అయింది. అయినప్పటికీ రోగికి నయం కాకాపోవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించి చికిత్స అందిస్తున్నారు. పేషెంట్ కట్టిన బిల్ నుండి 40 శాతం పేషెంట్‌ను హాస్పిటల్‌కు తరలించిన అంబులెన్స్ డ్రైవర్‌కు ముట్టచెప్పారు.

మంచిర్యాలలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తిర్యాణికి చెందిన ఓ యువకుడిని అంబులెన్స్ డ్రైవర్ కరీంనగర్‌లోని ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించాడు. అక్కడ కెనటమీ సర్జరీ చేసిన హాస్పిటల్ నిర్వాహకులు రోగి చికిత్సకు వేసిన బిల్లులో అంబులెన్స్ డ్రైవర్‌కు రూ.1.20లక్షలు కమీషన్‌గా అందించారు.

అంబులెన్స్ డ్రైవర్స్, ప్రయివేట్ ఆస్పత్రులపై నిఘా పెట్టాం : ఎ.భాస్కర్, డీసీపీ, మంచిర్యాల



రోగులను తరలించే అంబులెన్స్ డ్రైవర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాం. మాయ మాటలు చెప్పి రోగులను తరలించే అంబులెన్స్ డ్రైవర్లపై గతంలో కేసులు నమోదు చేశాం. రూల్స్‌కు విరుద్ధంగా ఎవరూ ప్రవర్తించొద్దు. కమీషన్‌లకు అలవాటు పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదు. ఎవరైన అంబులెన్స్ డ్రైవర్ రోగి కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా ఇతర హాస్పిటల్‌కు తరలిచింనట్లైతే ఫిర్యాదు చేయాలి. కరీంనగర్, మంచిర్యాలలోని ప్రయివేట్ హాస్పిటల్స్‌పై సైతం నిఘా పెట్టాం.

నిధులపై విస్తృత ప్రచారం కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించడంతో పాటు నిధులపై విస్తృత ప్రచారం కల్పించాలని ఎంపీ గోడం నగేష్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన దిశ సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. శాఖల వారీగా కేంద్ర ప్రభుత్వ నిధులు, పనులు, యూసీల వివరాలను తెలుసుకున్నారు. పనులు. అభివృద్ధి పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి అనేక నిధులను ఇస్తుందన్నారు. కానీ దాన్ని సక్రమంగా ఖర్చు చేయడం లేదన్నారు. జిల్లాలోని ఆయా శాఖలకు కేంద్రం నుంచి వచ్చిన ఖర్చు చేసి యూసీలు పంపని కారణంగా నిధులు రాలేదన్నారు. అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులతో చేపట్టే పనులపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. జిల్లాకు రావాల్సిన నిధులను వంద శాతం తీసుకువస్తానని, అధికారులు కూడా సక్రమంగా వాటిని ఖర్చు చేసి యూసీలను పంపాలన్నారు. అప్పుడే మరిన్నీ నిధులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, డీఆర్డీఓ సాయన్న డీఎస్ఓ కిరణ్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా సైబర్ క్రైమ్ డిఎస్పి హసీబుల్లా ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వీటి ద్వారా చైతన్యపరులైన ప్రజలు, ఆర్టీసీ సిబ్బంది సైబర్ క్రైమ్ ద్వారా మోసపోయిన వెంటనే 1930 సైబర్ క్రైమ్ నెంబర్‌ను సంప్రదించి సరైన సమయంలో న్యాయం జరిగి, పోయిన డబ్బును తిరిగి బాధితునికి అందించడం సంతోషకరంగా ఉందని ఎస్పీ తెలిపారు. బాధితుడు స్థానిక ఆర్టీసీ కండక్టర్ సయ్యద్ పర్వీజ్ ఈ నెల 10న క్రెడిట్ కార్డు లిమిట్‌ను లక్ష రూపాయలకు పెంచుదాం అంటూ ఫోన్ ద్వారా మాయమాటలు చెప్పి బాధితుడు ఎంతకైనా చెప్పకపోయేసరికి 6000 అదనపు డబ్బులను అందిస్తామని నమ్మబలికి మోసం చేసి బాధితుని క్రెడిట్ కార్డు వివరాలు, సివివి, ఓటిపి నంబర్లను తెలుసుకొని రూ.34వేలు బాధితుడు ఖాతా నుండి తస్కరించారు. జిల్లా పోలీస్ సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాల చైతన్య పరుడైన సయ్యద్ పర్వేస్ తాను మోసపోయానని గ్రహించి వెంటనే 1930 సైబర్ క్రైమ్ నెంబర్‌కి ఫోన్ చేసి, ఆదిలాబాద్ జిల్లా సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించారు. సైబర్ క్రైమ్ అధికారులు బాధితుడు పోగొట్టుకున్న డబ్బులను తాత్కాలికంగా నిలిపివేసి, బాధితునికి తిరిగి వచ్చే విధంగా కేసును నమోదు చేసి విచారణ చేపట్టి తిరిగి అందించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డిఎస్పి హసీబుల్లా, సిబ్బంది సింగర్వార్ సంజీవ్ కుమార్, సంతోష్, రియాజ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్క రైతుకు సంపూర్ణ రుణమాఫీ చేయాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నేడు ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టా పాసుపుస్తకం ఉండి రెండు లక్షల రుణం తీసుకున్న ప్రతి ఒక్క రైతుకు సంపూర్ణ రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించేంత వరకు బీఆర్ఎస్ తరపున పోరాడుతూనే ఉంటామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అన్నదాతలకు అండగా నిలవాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు గురువారం ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంపూర్ణ రుణమాఫీ చేయకుండా సాంకేతికత కారణాలను సాకుగా చూపి రైతులను ప్రభుత్వం మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిరసన తెలిపిన రైతులపై కేసులు నమోదు చేస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని స్పష్టం చేశారు. రుణమాఫీపై సాంకేతిక కారణాలను సాకుగా చూపి తప్పించుకునే ప్రయత్నం చేయకుండా రైతులకు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టే ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ముథోల్

ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో 2024- 25 సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ లెక్చరర్స్ పోస్టులు జీవశాస్త్రం-1, గణితం-1, పిజిటి టీచర్స్ తెలుగు-1, గణితం-2, టిజిటి టీచర్స్ గణితం-1, ఫిజికల్ సైన్స్-1 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఆగస్టు 23న ఉదయం 10గంటల నుండి 12గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ కొరకు ముథోల్‌లోని గురుకుల పాఠశాలలో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9848451133 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బంద్ ప్రశాంతం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన భారత్ బంద్ జిల్లాలో పాక్షికమైంది. ఉదయం నుంచి దుకాణాలు తెరుచుకోలేదు. ముందుగానే వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు సెలవులు ఇచ్చాయి. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడక్కడ తెరిచి ఉన్న దుకాణాలను మూసి వేయించారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌కు చేరి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. షెడ్యూల్ కులాలు ఐక్యంగా ఉండాలని వారిని ఎవరు వీడదీయవద్దని, రాజ్యాంగంలో ఆర్టికల్ 341లో బాబాసాహెబ్ అంబేద్కర్ పొందుపర్చారని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి జిల్లా కన్వీనర్ మేకల మల్లన్న అన్నారు. పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టకుండా సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా దీనిపై వ్యతిరేకత వస్తున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో కన్వీనర్ ప్రజ్ఞాకుమార్, అశోక్, గంగన్న, విఠల్, శోభతాయి తుల్జాపూరే పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్

లక్షెట్టిపేట : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలో బంద్ పాటించారు. మాల మహానాడు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో కేసు వేశామని, త్వరలోనే న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు దమ్మ నారాయణ, మండల అధ్యక్షుడు గరిసే రవీందర్, ప్రధాన కార్యదర్శి బైరం లింగన్న, మున్సిపల్ అధ్యక్షుడు పెండం రాజన్న, ఆశాది పురుషోత్తం, భూపెల్లి మల్లేష్, మాలం చిన్నయ్య పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీం కోర్టు పున:పరిశీలించి వర్గీకరణను వెంటనే నిలిపేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి రాజన్న అన్నారు. బుధవారం భారత్ బంద్ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎస్సీలు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, కేవలం రాజకీయ లబ్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం ఎస్సీల్లో వర్గీకరణ పేరుతో విభజించి పాలించు అనే ధోరణితో విభేదాలు సృష్టిస్తోందని పేర్కొన్నారు. ఎస్సీలపై ప్రేమ ఉంటే కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన ఎస్సీల రిజర్వేషన్లు పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలని ప్రయత్నాలు చేస్తోందన్నారు. దీన్ని అందరూ గమనించాలని, దళితులంతా ఐక్యంగా ఉండి రిజర్వేషన్లను కాపాడుకోవాలని తెలిపారు. దళితులు మనువాద పార్టీల మాయలో పడొద్దన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు తిరుమలేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్, నియోజకవర్గ అధ్యక్షులు మేష సతీష్, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల అశోక్, ద్యావతి రాజేశ్వర్, మ్యాద రాజేశ్వర్, దాసరి రాజేశ్వర్, పండుగ పెద్దలు, దాసరి రాజేశ్వర్ పాల్గొన్నారు.



ఖానాపూర్

కౌటాల : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో బంద్ పాటించారు. మాల మహానాడు సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.



భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన అంశాలపై రెవెన్యూ, పంచాయతీ, నీటిపారుదల శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ క్రమబద్ధీకరణ దరఖాస్తులను పగక్బందీగా పరిశీలించాలని సూచించారు. ప్రతి అధికారి ఎల్ఆర్ఎస్‌పై విస్తృత అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటికే ముగ్గురు సభ్యులతో కూడిన బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తుల పరిశీలన సందర్భంలో వివిధ దశలలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, దరఖాస్తును తిరస్కరించినట్లయితే కారణాలను రిమార్కుల విభాగంలో పొందుపరిచి, దరఖాస్తుదారునికి తెలియజేయాలన్నారు. ప్రభుత్వ భూములు, దేవాదాయ, శిఖం, చెరువులు, కుంటలకు సంబంధించిన భూములను క్రమబద్ధీకరించరాదని హెచ్చరించారు. మున్సిపాలిటీలు, మండలాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ట్రైనర్లు ఎల్ఆర్ఎస్‌లోని అంశాలు, సంబంధిత మొబైల్ యాప్‌లోని విషయాలు, దరఖాస్తుల పరిశీలన సమయంలో పాటించవలసిన నిబంధనలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం అధికారులకు ఎల్ఆర్ఎస్ అంశాలపై ఉన్న సందేహాలను ట్రెయినర్లు నివృత్తి చేశారు. సమావేశంలో డీఆర్ఓ భుజంగ్‌రావ్, జెడ్పీ సీఈఓ గోవింద్, డీపీఓ శ్రీనివాస్, సర్వేయర్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ సుదర్శన్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయితీ, నీటిపారుదల శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-దండేపల్లి

కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ఆయా కార్యాలయాల్లోని హాజరు పట్టికలను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సక్రమంగా మందులు, పరీక్షలు నిర్వహిస్తున్నారా అని ఆసుపత్రిలో ఉన్న రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ అధికారి కార్యాలయం వద్దకు రాగా ఎవరు కూడా ఆందోళన చెందవద్దని, అందరికీ రుణమాఫీ వర్తిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను పరిశీలించి ఆలస్యం ఎందుకు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వెంటనే పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ బ్యాంకును సందర్శించి రుణమాఫీపై ఆందోళన చెందవద్దని రైతులకు పలు సూచనలు చేశారు. లింగాపూర్ ఆదర్శ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.



యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్న కేజ్‌వీల్ ట్రాక్టర్లు



నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై కేజ్ వీల్ ట్రాక్టర్లు తిరగడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ప్రభుత్వం కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లు ధ్వంసమవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన రోడ్లపై తిరిగే కేజ్ వీల్ ట్రాక్టర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | 22 ఆగస్టు, 2024 | www.navatelangana.com

డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-సిరికొండ

డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని ఇచ్చోడ సీఐ భీమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో డ్రగ్స్, సైబర్ సెక్యూరిటీ, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళ లు, పిల్లలను టార్గెట్ చేస్తూ, కొందరు సైబర్ నేరగాళ్ల వాళ్ళ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. యువత ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని అన్నారు. డ్రగ్స్ మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కలిగిఉండి, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం డ్రగ్స్‌పై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నవీన్, ఏఎస్సై అశోక్ రెడ్డి, ప్రిన్సిపల్ సంధ్యారాణి పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రానికి చెందిన ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి నాన్న బేరే రాంరెడ్డి, ఆలంకొండ పోతన్న నాన్న, మంద గుండయ్య, మంచుకుంట లక్ష్మణ్, ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కాగా బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నాయకపు గంగామణిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సంధ్యారాణి, నాయకులు సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, ప్రవీణ్, రమణగౌడ్, స్వామి పాల్గొన్నారు.



పత్తిపంట క్షేత్ర ప్రదర్శన



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రానికి చెందిన రైతు మర్రి విలాస్ పత్తి పంట చేనులో విల్లోవుడ్ బయోక్సామ్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం రైతులతో కలిసి పత్తి పంట క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రొడక్ట్ అధికారి అనురాగ్ సింగ్ మాట్లాడుతూ ప్రపంచ సస్యరక్షణ ఉత్పాదనలో నిలుస్తున్న విల్లోవుడ్ కెమికల్స్ కంపెనీ రైతులకు పంట దిగుబడిలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గత 30 సంవత్సరాలు ఏకధాటిగా రైతులకు తక్కువ ధరలతో నాణ్యమైన మందులను సరఫరా చేస్తున్నామన్నారు. బయోక్సామ్ మందు పేను బంక, పచ్చ దోమ, సంపూర్ణంగా నివారిస్తుందని తెలిపారు. బ్రాండ్ ఎస్సీ పత్తి పంట పెరుగుదల ఈడీ మ్యాక్స్, తెల్లదోమ, సన్నపురుగు నివారించి, పూత రాలకుండా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా కొత్త పూతను పిందెలను మరోసారి వచ్చే విధంగా పనిచేస్తుందని అన్నారు. పత్తి పంట క్షేత్ర ప్రదర్శనలలో సౌత్ఇండియా మార్కెటింగ్ అధికారి పొన్నం సురేష్, రీజనల్ మేనేజర్ నరేష్‌రెడ్డి, హర్షవర్ధన్, టెరిటరీ మేనేజర్ దార్ల భోజన్న, మార్కెటింగ్ రిప్రజెంటివ్ సత్యపాల్, రైతులు ధనుంజయ రెడ్డి, మనోహర్‌రెడ్డి, దేవన్న, స్వామి, ఉశన్న, ప్రకాష్‌రెడ్డి స్థానిక రైతులతో పాటు వివిధ గ్రామాల నుంచి రైతులు క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చర్యలు



నవతెలంగాణ-కుభీర్

అక్రమంగా మత్తుపదార్థాల రవాణా విక్రయాలపై చర్యలు తప్పవని ఎస్పీ జానకి షర్మిలా అన్నారు. బుధవారం కుభీర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో ఉన్న యువకులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఉండాలని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. అదే విధంగా ఎవరైనా గంజాయి, విక్రహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అదే విధంగా గ్రామాల్లో పేకాట ఆడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామంలో కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు. దీంతో పాటు గ్రామంలో ప్రజలు పోలీసులు ఎలాంటి సమాచారం ఉన్న పోలిస్‌లకు సమాచారం ఇచ్చేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్పీ అవినాష్ కుమార్, భైంసా రూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై రవీందర్, కులాల ఎస్సై పోలిస్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా పుట్టినరోజు వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్‌ల ఆధ్వర్యంలో వికాసం (అంధుల) పాఠశాలలో విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెళ్లు శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం పట్టణంలోని వికాసం పాఠశాలలో ధరణి రాజేష్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పండ్లు పలహారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధరణి రాజేష్ మాట్లాడుతూ గెళ్లు శ్రీనివాస్ యాదవ్, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యలతో సుఖ సంతోషాలతో బాగుండాలని, ప్రజా సేవలో ముందు ఉండి ప్రజలకు అన్ని విధాల సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దూట మహేందర్, సత్తన్న, బాబా శ్యామ్, గిరి నాయక్, గురిజల సత్యం, సాజిద్, శివ, మహమ్మద్ ముజీబ్, ఆందోలి మాజీ ఉపసర్పంచ్ గైక్వాడ్ బాలాజీ, కుర్సెంగా భూమన్న పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా మధు

నవతెలంగాణ-లోకేశ్వరం

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మాలల సమావేశంలో బామ్ని గ్రామానికి చెందిన మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడారు. తనపై నమ్మకంతో సోషల్ మీడియా కన్వీనర్ బాధ్యతలు అప్పగించిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తన వంతుగా ఎస్సీ వర్గీకరణ రద్దుకు కృషి చేస్తానని తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-ఖానాపూర్

మండల ప్రజలు వినాయక చవితి, దేవీ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని సీఐ సైదారావు అన్నారు. బుధవారం ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొని, పోలీసులకు సహకరించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీ కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

- బాసర ట్రిపుల్ ఐటీ గేటు ఎదుట ధర్నా



నవతెలంగాణ-ముధోల్

బాసర ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. బుధవారం కార్మికులు బాసర ట్రిపుల్ ఐటీ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాసర ట్రిపుల్ ఐటీ కార్మికులకు రూ.10,800 వేతనం తీసుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ తర్వాత బేసిక్ సాలరీ జీఓ నెం.60, ప్రకారం కార్మికులకు అమలు చేయాలని, గత ప్రభుత్వం జీఓ ఇవ్వడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాసర ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న హౌస్ కీపింగ్ కార్మికులకు రూ.16,500 వేతనాలు అమలు చేయాలని తెలిపారు. ఇప్పుడు కార్మికులకు చేతికి రూ.10,800 మాత్రమే ఇస్తున్నారన్నారు. పీఎఫ్ రూ.1200, ఈఎస్ఐ రూ.200 కట్ అవుతుందన్నారు. మొత్తం వేతనం రూ.12,200 కాంట్రాక్టర్ కార్మికులకు నెల వేతనం ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. వారికి రావాల్సిన మొత్తం వేతనం వెంటనే కార్మికులకు అందే విధంగా ఉన్నతాధికారులు చొరువా చూపాలని డిమాండ్ చేశారు. జీఓ నెం.60 ప్రకారం రూ.16,500 కార్మికులకు నెల వేతనం అమలు చేయాలని అన్నారు. ఈ దేశంలో, రాష్ట్రంలో కార్మికుల కుటుంబాలు జీవన ఉపాధి కొనసాగించాలంటే పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వారి నెలసరి వేతనం బేసిక్ సాలరీ సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని అన్నారు. సమస్య పరిష్కరించకుంటే సెప్టెంబర్ 9న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గ్రైని మురళి, అధ్యక్షులు ఫీరాజి, ప్రధాన కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షులు లింగన్న, రెంజర్ల భారతి, దయానంద్, సిద్దు, సాయిలు, సహాయ కార్యదర్శి ప్రేమల గోదావరి, శారదమ్మ, కోశాధికారి లలితబాయి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి రుణమాఫీ ప్రకటించే వరకు పోరాటం

నవతెలంగాణ-తలమడుగు

పూర్తిస్థాయి రుణమాఫీ ప్రకటించే వరకు బీఆర్ఎస్ అండగా ఉండి పోరాటం చేస్తుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని రుయ్యాడి గ్రామ రైతులు పూర్తి స్థాయి రుణమాఫీ చేయాలని సీఎం శవయాత్ర చేపట్టారు. దీంతో పోలీసులు రైతులపై కేసులు నమోదు చేశారు. కాగా బుధవారం మాజీ మంత్రి జోగు రామన్న బాధిత రైతులను పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకులు ఇప్పటివరకు 40 శాతం రైతులకు రుణమాఫీ కాలేదని, రుణమాఫీ పై రైతులు పోరాటం చేస్తే, అక్రమ కేసులు బనాయిస్తారా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులందరికీ రుణమాఫీ చేసేంత వరకు రైతుల తరపున పోరాటం చేస్తామన్నారు. రైతుల పక్షాన అండగా నిలబడి పోరాట నిర్వహిస్తామని, ఎంత మంది రైతులపై కేసులు పెడతారో పెట్టుకోండని అన్నారు. వివిధ బ్యాంకుల్లో వేలాది మంది రైతులు రుణాలు తీసుకుంటే కేవలం వందల్లో రైతులకు రుణమాఫీ జరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ వ్యవసాయశాఖ అధికారులు లీడ్ బ్యాంక్ అధికారులతో మాట్లాడినప్పటికీ రుణమాఫీపై స్పష్టమైన సమాధానం రాలేదన్నారు. రైతుల గోడు ఎవరికి చెప్పుకోవాలని అన్నారు. రైతుల హక్కుల కోసం ధర్నా రాస్తా రోకో నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, లింగారెడ్డి, తోట వెంకటేష్, కిరణ్ కుమార్, కేదారేశ్వర్‌రెడ్డి, గంగాధర్, నర్సిములు, సుదర్శన్ రెడ్డి, పల్లవి, ప్రకాష్‌రెడ్డి, రమాకాంత్, ప్రవీణ్, పలువురు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.



నేరడిగొండ : రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మోసం చేసిందని మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులందరికి రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని చెప్పి, కొందరికే రుణమాఫీ చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏలేటి రవీందర్‌రెడ్డి, గులాబ్ సింగ్, శివారెడ్డి, సర్ చంద్, శ్రీనివాస్ రెడ్డి, పండరి పాల్గొన్నారు.

ఖానాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరిట రైతులను దారుణంగా మోసం చేసిందని, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తామని చెప్పి పాక్షిక రుణమాఫీ చేసిందని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కల్వకుంట్ల నారాయణ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎలాంటి షరతుల లేకుండా రెండు లక్షల రుణమాఫీ రైతుల ఖాతాలో వేస్తామని చెప్పి రైతులను మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సమావేశాలలో అబద్ధపు మాటలను చెప్పి, ఓట్లు వేయించుకున్నారని అన్నారు. రైతులకు ఇచ్చిన మాటను తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరును నిరసిస్తూ, 22న మండల కేంద్రంలో తెలంగాణ తల్లి చౌక్ వద్ద జరగబోయే రైతుధర్నా కార్యక్రమానికి రైతులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై, ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షులు తాళ్లపల్లి రాజగంగన్న పట్టణాధ్యక్షులు గౌరీకార్ రాజు, మాజీ రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ కొకూల ప్రదీప్ పాల్గొన్నారు.

నార్నూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బుధవారం మలంగి తండా రైతులు కోరారు. రుణమాఫీ కాకపోవడంతో బుధవారం మలంగి గ్రామంలో రైతులు ధర్నా చేశారు. ఏఈఓ నిఖిల్‌కు వినతిపత్రం అందజేశారు. దాదాపు గ్రామంలో రెండు లక్షల పైన రుణం తీసుకున్న రైతులు 60 మంది వరకు ఉంటారని ఎవ్వరికీ రుణమాఫీ కాలేదని ఆరోపించారు.రైతులు తీసుకున్న రెండు లక్షల పైన రుణాలను కట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం పున : పరిశీలన చేయాలని ముందుగా రెండు లక్షల రుణమాఫీ చేయాలని తర్వాత మిగిలిన మొత్తాన్ని మేము వివిధ దఫాలో కట్టుకుంటామని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఏఈఓ నిఖిల్ రైతులకు భరోసా కల్పించడంతో రైతులు ధర్నా విరమించారు. వినతిపత్రం అందించిన వారిలో జె.జగన్, సీహెచ్ రామారావ్, ఎ.గోకుల్, సీహెచ్ కిషన్, సీహెచ్ విఠల్, జాదవ్ గణేష్, శంకర్, రైతులు ఉన్నారు.







మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-తాంసి

మత్తు, పదార్థాలతో పాటు మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని భీంపూర్ ఎస్సై ఎండి ఖలీమ్ విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆశ్రమ పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన వాటివల్ల అనర్థాల గురించి, విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యపైనే ధ్యాసఉంచాలని అన్నారు. కానీ మద్యపానం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగంతో విద్యార్థి బంగారు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. మత్తు పదార్థాల కారణంగా చెడు వ్యసనాలు అలవడుతాయని అన్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాలలో గంజాయి సాగు చేయడం జరుగుతుందని, ఎట్టి పరిస్థితులలో గంజాయి సాగు చేస్తున్నట్టు మా దృష్టికి వస్తే అలాంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు తమ గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు చేయడం విక్రయించడం జరిగినట్టు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఆయా గ్రామాల్లోని వివిధ పాఠశాలల్లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేందర్ యాదవ్, తూము రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస స్వామి, వినోద్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.



ఏఈఓ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-ముధోల్

ఏఈఓ శ్రీనివాస్ సేవలు అభినందనీయమని ఎడ్‌బిడ్ గ్రామస్తులు అన్నారు. బుధవారం మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో బదిలీపై వెలుతున్న ఏఈఓను ఆయా పార్టీల నాయకులు, రైతులు ఘనంగా సన్మానించారు. రైతులందరితో కలిసి మెలసి ఉండి సకాలంలో రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేవారని అన్నారు. పంటల నమోదు పకడ్బందీగా నిర్వహించారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని వారు పేర్కొన్నారు. ఎక్కడ పనిచేసిన రైతుల అభివృద్ధి కోసం కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు, నిమ్మ పోతన్న, రాములు, నాయకులు దత్త్రాత్రి, రాజారెడ్డి, రవిందర్‌రెడ్డి, సాయంరెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-బోథ్

సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ బి.హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం బోథ్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్ విజయవంతం చేయడానికి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా చూడాలని అన్నారు. దీనిపై న్యాయవాదులు కృషి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్‌రావ్ దేశ్‌పాండే, న్యాయవాదులు కే.సుభాష్, అంగద్ కేంద్రే, ఠాకూర్ రూపేందర్‌సింగ్, కుమ్మరి విజయ్ కుమార్, ఆడెపు హరీష్, దమ్మాపాల్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, పంచాయతీ కార్యదర్శులు నాలుగు రోజులు సామూహిక సెలవు ప్రకటించారు. నార్నూర్ పంచాయతీ కార్యదర్శి దినేష్ సస్పెన్షన్‌కు నిరసనగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ శ్రీనివాస్‌కు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నాలుగు రోజుల పాటు సామూహిక సెలవు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పాలన ఫిబ్రవరి నుంచి ఎస్ఎఫ్‌సీ, పీఎఫ్ఎంఎస్ నిధులు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో రాకపోవడంతో పంచాయతీలో చేయాల్సిన పనులు కుటుంబడటంతో పంచామతీ కార్యదర్శుల సొంత డబ్బులతో పనిచేస్తూ గ్రామాభివృద్ధికి పాలుపంచుకుంటున్నారని పేర్కొన్నారు. అయినప్పటికి జిల్లా యంత్రాంగం మాపై ఐటీ సస్పెన్షన్, మోపుతూ మానసికంగా తీవ్ర ఒత్తిడిలకు గురి చేస్తున్నారని అన్నారు. నార్నూర్ పంచాయతీ కార్యదర్శి దినేష్ సస్పెన్షన్ మమల్ని తీవ్రంగా కలిచివేసి నందున మండల పంచాయతీ కార్యదర్శులు అందరం కలిసి నాలుగు రోజుల పాటు సామూహిక సెలవు ప్రకటించారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మత్తులు

నవతెలంగాణ-ముధోల్

మండలంలోని విట్టోలి తండ నుంచి అష్ట వెళ్లే రోడ్డుపై గుంతలు ఉండటంతో వాహనదారులకు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వెంటనే రోడ్డు భవనల శాఖ అధికారులతో మాట్లాడారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో బుధవారం రోడ్డుకు రోడ్డు భవనల శాఖ అధికారులు మరమ్మతుల పనులు చేపట్టారు. ఎమ్మెల్యే చొరవతో రోడ్డు బాగు చేస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వీరి వెంట యువ నాయకుడు సతీష్ రెడ్డి ఉన్నారు.

వ్యాక్సినేషన్ కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-ముధోల్

మండలం కేంద్రంలోని బీసీ సంఘ భవనంలోని వ్యాక్సినేషన్ కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఇద్రిస్ గోరి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి, సలహాలు, సూచనలు ఇచ్చారు. వ్యాక్సినేషన్ కొరకు వచ్చిన పిల్లల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. పిల్లల తల్లులకు తప్పనిసరిగా ఆరోగ్య నియమాలు చెప్పాలని అన్నారు. ఆయన వెంట వైద్యాధికారిని నేహా, సాదఫ్, ఏఎన్ఎం విజయ, ఆశ కార్యకర్త సుజాత ఉన్నారు.



అగర్‌గూడలో ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని అగర్‌గూడ గ్రామంలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 57 మందిని పరీక్షించగా, 11 మంది రక్త నమూనాలు సేకరించి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మాధురి, హెచ్‌ఏ ధర్మారావు, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

భారత్ బంద్ సంపూర్ణం

నవతెలంగాణ-వాంకిడి



ఇటీవల సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పుకు నిరసనగా బుధవారం దళిత సంఘాలు భారత్ బంద్ మండల కేంద్రంలో సంపూర్ణం అయింది. వ్యాపార సంస్థలు, ప్రయివేటు విద్యా సంస్థలు, ప్రభుత్వ విద్యా సంస్థలు, హోటళ్లు, ఆటోలు, ఇతర వాహనాలు, కూర గాయల షాపులు, పెట్రోల్ పంపులు, బ్రాండీ షాపులు, ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంకులు బందులో పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం, భారతీయ బౌద్ధ మహా సభ, రమా బాయి మహిళ మండలి, సిద్దార్థ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ బందులో పాల్గొని మద్దతు తెలిపారు. అంతకు ముందు మండల కేంద్రంలో సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఉద్యోగుల రక్షణకు సింగరేణి పటిష్ట చర్యలు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగుల రక్షణకు పటిష్ట చర్యలు చేపడుతోందని ఖైరిగూడ ఓసీపీ కార్పోరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం వారు ఖైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈస్ట్ వ్యూ పాయింట్ నుంచి పని స్థలాలను పరిశీలించారు. అనంతరం ఇన్ పిట్ క్రషర్‌ను చూశారు. వర్షాకాలంలో గనుల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలను వివరించారు. యంత్రాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఓసీ లో రక్షణ ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం రీజియన్ జీఎం కేహెచ్‌ఎన్ గుప్తా, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కె రఘుకుమార్, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, పీఓ మచ్చగిరి నరేందర్, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

రేపు ఎల్లుండి జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 22, 23 తేదీల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలని జిల్లా విద్యాధికారి అశోక్ ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రయాన్ 3 మిషన్ విజయవంతాన్ని పురస్కరించుకొని భారత ప్రధాని నరేంద్ర మోడీ సూచన మేరకు ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు భాగస్వాములు కావాలని పాఠశాలల్లో చంద్రయాన్ 3 కి సంబంధించిన నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులు వెబ్ లింక్ ద్వారా తమ కార్యకలాపాలు నమోదు చేయాలని, పై రెండు తేదీల్లో చంద్రయాన్ ఉత్సవ్ మాడ్యూల్స్ నిర్వహించాలని దీనికోసం ఎన్‌సీఈఆర్‌టీ. ఎన్ఐసీ.ఇన్/చంద్రయాన్. పీహెచ్‌పీ వెబ్ సైట్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. విద్యార్థులతో స్పేస్ సైన్స్ పోస్టర్ల పోటీలు నిర్వహించవచ్చని, చంద్రయాన్ మాడ్యూల్ ఆధారంగా ఆన్‌లైన్ తరగతుల కోసం ఎన్సీఈఆర్టీ రూపొందించిన 30 నిమిషాల వీడియో ఈ నెల 23న ప్రదర్శింపబడుతుందని దీనికోసం ప్రత్యేక లింకు పంపించడం జరుగుతుందని, అన్ని పాఠశాలలు కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్‌ను సంప్రదించాలని సూచించారు.

వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యుల సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యులు బుధవారం బెల్లంపల్లి ఏరియా అధికారులతో సమావేశం నిర్వహించారు. బెల్లంపల్లి జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల అధిపతులు సమావేశంలో పాల్గొన్నారు. జీఎం ఐఅండ్‌పీఎం కార్పోరేట్ ఎ రవి కుమార్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉత్పత్తి, ఉత్పాదకతకు అవసరం అయ్యే యంత్రాలు, పరికరాల వివరాలను తెలుసుకున్నారు. జీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కె రాజమల్లు, నరేందర్, ఉమాకాంత్, భీంరావ్ జాడే, వర్క్ షాప్ కృష్ణమూర్తి, వీరన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రుణం పూర్తిగా చెల్లించిన అప్పు చూపిస్తున్నారు'

నవతెలంగాణ-బెజ్జూర్

సహకార సంఘంలో తను తీసుకున్న రుణాన్ని పూర్తిగా కట్టినప్పటికీ తన పేరు మీద ఇంకా అప్పు ఉన్నట్లు సహకార సంఘం అధికారులు చూపిస్తున్నారని పెంచికల్ పేటకు చెందిన మహిళ రైతు రిక్కుబాయి కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బెజ్జూర్ వైద్యశాలను సందర్శించిన సమయంలో కలెక్టర్‌ను కలిసి తన గోడును వెళ్లగక్కారు. సహకార సంఘం సీఈఓ తమను మోసం చేశారని అతనిపై చర్య తీసుకోవాలని ఆమె కోరారు. రుణమాఫికి సంబంధించిన పత్రాలను కలెక్టర్‌కు చూపించారు.


రైతులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

రెబ్బెన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారుల వల్ల నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నవీన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి లేని పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అనువణువునా అవినీతితో రాజ్యమేలుతుంది ఒక వైపు రైతులకు రుణమాఫీ చేస్తానని అమలు కాని హామీ ఇచ్చి 50 శాతం వరకే అమలు చేసి మిగతా రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. రెబ్బెన ప్రాథమిక సహకార సంఘం అధికారులు రైతులకు తెలియకుండానే వారి పేర్ల మీద రుణాలు తీసి మాఫీ వచ్చిన డబ్బులను గత కొన్ని సంవత్సరాలుగా కాజేస్తున్నారు. పది పదిహేను సంవత్సరాల క్రితం చనిపోయిన రైతుల పేరిట కూడా రుణాలను మంజూరు చేస్తూ వారికి వచ్చిన రుణమాఫీని కూడా కాజేసిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయన్నారు.

టౌన్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ టౌన్ ఎస్ఐగా డీకొండ రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన టౌన్ ఎస్ఐలు ఇద్దరు అంజయ్య, మహేందర్ బదిలీ అయిన విషయం తెల్సిందే. సిర్పూర్(టి)లో ఎస్ఐగా విధులు నిర్వర్తించిన రమేష్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను నేరుగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని, ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తనకు నేరుగా తెలియజేయాలని, సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేలా కృషి చేస్తానన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీడీఓ ఆల్బర్ట్, ఇన్‌చార్జి ఏఓ రామకృష్ణ, పశువైద్యాధికారి రాకేష్, విద్యుత్ సబ్ ఇన్‌జనీర్ అజయ్, ఏపీఓ సతీష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్, మిషన్ భగీరథ ఏఈ పృథ్వి అంగన్‌వాడీ సూపర్ వైజర్ హకీనా, ఎంఈఓ రమేష్ బాబు, పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-బెజ్జూర్

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం మండలంలోని భారగూడెం, పోతేపెల్లి, బెజ్జూరు గ్రామాల్లో పర్యటించారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు చేపట్టాలని వైద్యాధికారి తుకారాం బట్‌ను ఆదేశించారు. జిల్లాలో వైద్యుల కొరత ఉందని త్వరలో ఖాళీలను భర్తీ చేస్తామని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. వ్యాధులను నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అన్ని సౌకర్యాలు ఉన్నాయని ప్రజలకు వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ సెంటర్‌లోనే వార్డులను పరిశీలించారు. రోగులను వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మలేరియా డెంగ్యూ కేసులు ఉన్నాయని, ఒళ్ళు నొప్పులతో పేషెంట్లు బాధపడుతున్నట్లు రికార్డులో చూసి సిబ్బందిని అడిగి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మండలంలోని భారగూడెం, పోతేపెల్లి గ్రామాల్లోని రోడ్లను పరిశీలించారు. ప్రత్యేక అధికారి చొరవ తీసుకుని గ్రామాల్లో రోడ్ల గుంతలను పూడ్చివేయాలని ఆదేశించారు. మండల శివారులోని 761, 762 సర్వే నెంబర్లలో పట్టేదారు పాస్ బుక్ పుస్తకాలు లేక రైతుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెవెన్యూ అటవీ శాఖ అధికారులు సర్వేలు చేసి పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ భుమేశ్వర్‌ను సంయుక్త సర్వేలు నిర్వహించి పట్టాలు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ తుకారాం బట్, సీఈఓ రాదండి లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేక అధికారి వెంకటేష్, ఎంపీడీఓ గౌరీ శంకర్, డాక్టర్ అవినాష్ పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చూడాలి

- అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలి
- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ప్రభుత్వ అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఇబ్బందులు రాకుడా చూడాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం మండలంలో డబ్బా, బారెగూడ గ్రామాలలో పర్యవేక్షించి రోడ్లు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పర్యవేక్షించారు. రోడ్డు పూర్తిగా బురదమయంగా ఉందని గ్రామస్థులు కలెక్టర్‌కు చెప్పగా, ఆయన వెంటనే రోడ్డు మరమ్మత్తుల కోసం ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. అరక గూడా ప్రాజెక్టు ద్వారా బ్యాక్ వాటర్ బారెగూడ గ్రామంలో వర్షాకాలంలో ముంపుకు గురవుతుందని కలెక్టర్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా, డబ్బా ఎక్స్ రోడ్ వద్ద బాధిత కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే క్రమంలో అవకతవకలు జరిగాయని వివరించారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను పూర్తి దర్యాప్తు చేసి వివరణ ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. అక్కడ నుంచి ప్రైమరీ స్కూల్ దగ్గర చేపట్టిన అమ్మా ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించి పనులు అసంపూర్తిగా ఉండడంతో ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓ వివరాలు తెలుసుకొని ఈ పనులు ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం చూస్తున్నట్లు చెప్పడంతో, ప్రత్యేక అధికారి వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో కలెక్టర్ మొక్కలు నాటేందుకు అధికారులు గుంతలు తవ్వి మొక్కలను సిద్ధం చేయగా, పాఠశాలలో నాణ్యత లేకుండా, అసంపూర్తిగా పనులు ఉండడంతో, మొక్కలను నాటకుండా వెనుదిరిగి వెళ్ళిపోయారు. ఆయనతో పాటు డీఎంహెచ్‌ఓ తుకారాం భట్, తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీఓ కోట ప్రసాద్ పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికేతర ఉపాధ్యాయులను బదిలీ చేయాలి

నవతెలంగాణ-బెజ్జూర్



స్థానికేతర ఉపాధ్యాయులను వెంటనే సొంత జిల్లాలకు బదిలీ చేయాలని పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఏటకూరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు 2004 నుండి ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని గత సంవత్సరం జూలై నుంచి రావలసిన వితరణ సవరణ నివేదికను వెంటనే విడుదల చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు 50 శాతం వేతన సవరణ ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు అన్నింటిని వెంటనే మంజూరు చేయాలని పాఠశాలలో ఉపాధ్యాయుల విద్యార్థుల సంఖ్యను అనుగుణంగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలని కోరారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రామ్ టాంకు తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా మాల్కర్ సుభాష్, అసోసియేషన్ అధ్యక్షుడిగా జర్పుల విజయ్. మహిళా ఉపాధ్యక్షురాలు అనసూయ, కార్యదర్శి అయేషా అంజుమ్ ఏకగ్రీవ ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు దొంగల సంతోష్, రాహుల్, సమత, కవిత, శ్రీలత, పూనేష్, జితేందర్ పాల్గొన్నారు.

ఓటర్ జాబితా సర్వేకు పార్టీలు సహకరించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సెప్టెంబర్ 15 వరకు కొనసాగనున్న బిఎల్‌వోల ఇంటింటి ఓటర్ జాబితా సర్వేకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. కలెక్టరేట్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇంటింటి ఓటర్ జాబితా సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 15వరకు బూత్ లెవెల్ అధికారులు ఓటర్ జాబితా సర్వే కోసం ఇంటింటికి వెళ్తారని అన్నారు. మరణించిన ఓటర్లు, ఊరు వదిలి వెళ్లిపోయిన ఓటర్లను గుర్తించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీల ప్రతినిధులపై ఉంటుందన్నారు. అటువంటి వారిని గుర్తించి వారికి మొదట నోటీసులు జారీ చేసి ఓటరు జాబితా నుండి తీసివేయడం జరుగుతుందని తెలిపారు. ఓటరు జాబితా తయారీ కోసం పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు ఈ సందర్భంగా పలు ప్రశ్నలు రాజకీయ పార్టీ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పార్లమెంట్ ఎన్నికలకు ఉపయోగించిన వివి ప్యాడ్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు ప్రస్తుతం వ్యవసాయ గోడౌన్‌లో ఉన్నాయని, పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల గోడౌన్లకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కబ్జాలు అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలో కబ్జాలను అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యక్రమ కో ఆర్డినేటర్ గోలెం వెంకటేష్ ఆరోపించారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడైతే ఖాళీ భూమి ఉంటుందో అక్కడ భూ కబ్జాదారులు చేరి కోట్ల విలువైన భూములను ఆక్రమించుకుంటున్నారని అన్నారు. పట్టణంలో 147/2, 143లో ప్రభుత్వ భూములు ఈ విధంగానే కబ్జాకు గురయ్యాయని అన్నారు. అధికారులు ఈ భూములపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఐకేపీ వీఓఏల సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు రమా డిమండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు రూ.26000 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు సమ్మె చేస్తున్న సందర్భంలో ఎన్నిక తర్వాత కనీస వేతనం ఇస్తామని కరపత్రాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మధుకర్, ర్యదర్శి మల్లయ్య, కోశాధికారి స్వప్నలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏమాజీ, ముకుందం, బాపు, తిరుపతి, మహేష్, సంతోష్, రజిత పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఒకరికి రిమాండ్

నవతెలంగాణ-కౌటాల

గంజాయి అమ్ముతూ పట్టు పడిన వ్యక్తికి రిమాండ్ విధించినట్లు సీఐ ముత్యం రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగెపెల్లి ఎక్స్ రోడ్డు వద్ద మద్దెల సతీష్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్ఐ ఎన్ మధుకర్ కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లా వాసి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లా వాసి ఎలగతి సుచిత్‌ను నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మంగళవారం రాష్ట్ర కమిటీని ప్రకటించగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా జిల్లాలోని వాంకిడి మండల కేంద్రానికి చెందిన ఎలగతి సుచిత్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు. పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా సుచిత్ పనిచేసిన విషయం తెలిసిందే.

ఉద్యోగులకు బదిలీలు సహజమే

నవతెలంగాణ-తిర్యాణీ



ప్రతి ఉద్యోగికి బదిలీలు సహజమేనని మాజీ జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, సర్పంచ్ తోట లచ్చన్న అన్నారు. బుధవారం మండలంలో పంచాయతీ కార్యదర్శిగా సేవలందించి బదిలీపై మంచిర్యాల జిల్లాకు వెళ్తున్న అంజయ్యకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే నూతనంగా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రాజేశ్వరిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాసాడి రామన్న పాల్గొన్నారు.

ట్రస్మా నాయకులకు సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ రికగ్నైజర్ స్కూల్ పాఠశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందిస్తూ లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నామని రాష్ట్ర ట్రస్మా అసోసియేట్ ప్రెసిడెంట్ పెద్దపల్లి కిషన్ రావు, జిల్లా అధ్యక్షుడు దేవభూషణం అన్నారు. బుధవారం రెబ్బెన మండల కేంద్రంలో ప్రయివేటు పాఠశాలల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర పరిశీలకులుగా జిల్లా అధ్యక్షులతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా మండల కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముందుగా రాష్ట్ర బాధ్యులను, జిల్లా బాధ్యులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గుర్తింపు పొందిన పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించి విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత మా ప్రైవేట్ పాఠశాలలకే దక్కిందని అన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి పాఠశాలలను కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, జిల్లా కోశాధికారి బి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర నాయకులు అన్నపూర్ణ, సుదర్శన్ గౌడ్, జితేష్ సితాని, మండల నాయకులు ఇప్ప పోచయ్య, దీకొండ సంజీవ్ కుమార్, మల్లిక్, రఘుపతి, శైలజ రాజేష్ పాల్గొన్నారు.

నిధులు కాజేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెబ్బెన మండలంలోని గోలేటి గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఎంపీడీఓ మాజీ సర్పంచ్ ఈసీఎస్ ఏపీఎం లపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోలేటి గ్రామపంచాయతీలో ఇంకుడు గుంతలు మరుగుదొడ్ల గ్రామపంచాయతీ నిధులు మొత్తం కలిపి రూ.కోటికి పైగా నిధులు కాజేశారని అన్నారు. 750 మందికి మరుగుదొడ్ల బిల్లులు 630 మందికి ఇంకుడు గుంతల బిల్లులు చెల్లించలేదన్నారు. 2023లో చేసిన ఆందోళన ఇచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో కొంత మొత్తాన్ని రికవరీ చేశారని తెలిపారు. మొత్తం సొమ్ము రికవరీ చేసి ఆ మొత్తాన్ని వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. లేదంటే లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై కృష్ణకుమారి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మల్రాజు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నవీన్ గౌడ్, నారా నాగమ్మ, జటంగుల వెంకటేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

నవతెలంగాణ-జన్నారం



విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని జన్నారం మండల ఎంపీడీఓ శశికళ సూచించారు. బుధవారం పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, నిర్వాహకులతో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు మంచి భోజనం పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జలంధర్, పోస్టల్ ఈఓ రాహుల్, పంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి

● డీపీఓ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-జైపూర్

గ్రామపంచాయతీల పరిధిలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర రావు సూచించారు. మండలంలోని వేలాల, కిష్టాపూర్, పౌనూర్, శివ్వారం గ్రామాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రామపంచాయతీల పరిధిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి మురికి నీరు ఎక్కడ కూడా నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అంతర్గత రోడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ కూడా ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు కనిపించకూడదని అన్నారు. బాధ్యతారాహితంగా వ్యవహరించిన వారికి జరిమానా విదించాలని సూచించారు. కిష్టాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల కిరాణా షాప్ యజమాని చెత్తను పడవేసినందుకు రూ.2000 జరిమానా విధించారు. వారంలో ఒక రోజు నీటి పాత్రలను ఆరబెట్టుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో యాజమాన్యం విఫలం



నవతెలంగాణ-నస్పూర్

కార్మికులకు మెరుగైన వసతులు కల్పించడంలో యాజమాన్యం విఫలం అవుతోందని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా అన్నారు. బుధవారం ఆర్కె-5 గనిని సందర్శించి వివిధ డిపార్ట్మెంట్లలో ఉన్న కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థకు సంబంధించిన రూ.వేలకోట్లను రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సిఎస్ఆర్, డీఎంఎఫ్టీ నిధుల పేరుతో ధారా దత్తం చేస్తున్న యాజమాన్యం కార్మికులకు కనీసం రెస్ట్ హాల్స్, కబోర్డ్స్ కట్టే పరిస్థితులలో లేదన్నారు. ఆర్కె-5 గనిలో కార్మికుల రెస్ట్ హాల్స్ అధ్వానంగా ఉన్నాయని వర్షం పడితే రెస్ట్ హాల్లలో నీరు కారుతోందని లన్నారు. కార్మికులకు నాణ్యమైన వస్తువులను సరఫరా చేసే స్థానంలో నాసిరకమైన బూట్లు, డ్రిల్ బిట్లు సరఫరా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి సత్తిరెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ట్రేడ్స్ మేన్స్ నాయకులు సురేష్ నాయకులు మల్లేష్, జీపీ రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ ఎదుట ఉన్న టేలను తొలగించాలి



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ఎస్సీ బాయ్స్ హాస్టల్ ఎదుట కొనసాగుతున్న గుట్కాలు విక్రయిస్తున్న టేలను వెంటనే తొలగించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఓపీడీఆర్) ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కార్యదర్శి అంబాల మహేందర్ కోరారు. డ్రగ్స్, గుట్కా, మాధక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపుతామని ప్రభుత్వం ఒకవైపు ప్రకటనలు చేస్తుంటే కిందిస్థాయి సంబంధిత శాఖలు మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. హాస్టల్ ముందు ఎలాంటి అనుమతులు లేకుండా టెలను నిర్మించి పాన్పరాకు, గుట్కాలను అమ్ముకోవడానికి స్థానిక అధికార పార్టీ నేతల హస్తం ఉన్నట్లు తెలిపారు. విద్యాలయాలకు సమీపాన ఈ తరహా పాన్ టేలలు ఉండకూడదు అని నిబంధనలు ఉన్నప్పటికీ, సంబంధిత విద్యాశాఖ అధికారులు సైతం తనకేమి పట్టినట్టు వ్యవహరించడం ఏమిటో సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. తక్షణమే విద్యాశాఖ, మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకొని సదరు టేలను తొలగించకపోతే విద్యార్థులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని, విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రతిఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజుల సందర్భంగా మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం 75వ వనమహోత్సవంలో భాగంగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ఆవరణలో సుమారు 6000 మొక్కలను నాటారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియాలో సుమారు పదివేల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో అధిక సంఖ్యలో మొక్కలను నాటడం జరుగుతుందని చెప్పారు. వృక్షో రక్షతి రక్షిత్ణ అని మహానుభావులు చెప్పిన విధంగా వక్షాలను మనం రక్షిస్తే వక్షాలు మనల్ని రక్షిస్తాయని, ఈ మహా యజ్ఞములో పాలు పంచుకున్న ప్రతి ఒక్క ఉద్యోగి భావి తరాలకు మంచి గాలి, నీరు అందించిన వారవుతారని తెలిపారు. సంస్థ మొక్కలు నాటడంతో పాటు సింగరేణి విస్తరించి ఉన్న ఏరియాలలో పండ్ల మొక్కలు పూల మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు అరవింద రావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, రవీందర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, గని మేనేజర్ బ్రహ్మాజీ, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఉపరితల గని పిట్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, సీనియర్ ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్, పిట్ సెక్రటరీ లచ్చన్న, బద్రి బుచ్చన్న పాల్గొన్నారు.

నిలువ ఉంచిన కలప పట్టివేత

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో ఒక ఇంటిలో అక్రమంగా నిలువ ఉంచిన కలపను బుధవారం జన్నారం అటవీ అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న కలప విలువ రూ.15,150 ఉందని డీఆర్ఓ తిరుపతి తెలిపారు. కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఆ వ్యక్తిని పట్టుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. అక్రమ కలప రవాణా చేసిన నిలువ ఉంచిన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-మందమర్రి



మందమర్రి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెడు అలవాట్లకు బానిసలై భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్‌రెడ్డి సూచించారు. యాంటీ నార్కోటిక్ అవేర్నెస్ డే కార్యక్రమంలో భాగంగా బుధవారం కార్మెల్ అకాడమీ విద్యార్థులకు గంజాయి, మాదక ద్రవ్యాలు, వాటి వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. గంజాయి, సిగరెట్, గుట్కా, ఆల్కహాల్ వంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకొని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా, పీల్చిన తమ దృష్టికి తేవాలని, చెప్పిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని, గంజాయి మహమ్మారి నిర్మూలనలో భాగస్వామ్యం అవ్వాలని తెలిపారు. గంజాయి నిర్మూలన-అవగాహన కోసమే విద్యార్థులతో కూడిన ప్రహరీ క్లబ్ (యాంటీ డ్రగ్స్ కమిటీ) అని తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై సమాజం పై వాటి ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించడం కోసం తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఆదేశాల మేరకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు , స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి, పోలీస్ అధికారులతో మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో 14 విద్యా సంస్థలలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, అదనపు ఎస్ఐ శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ గ్జేవియర్ రెక్స్ ఫాదర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జైపూర్ : సిగరెట్, గుట్కా, ఆల్కహాల్ వంటి చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని భీమారం ఎస్ఐ రాములు అన్నారు. భీమారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో బుధవారం సమావేశమైన ఆయన మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్, రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు యాంటీ నార్కోటిక్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ భూమన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్రమ్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : లక్షెట్టిపెట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన ఆవశ్యకతపై ఎస్ఐ ఐ సతీష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి వాడకం, అమ్మకం నేరమని ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. గంజాయి మత్తులో విచక్షణ రహితంగా ఎవరైన ప్రవర్తిస్తే శాంతి భద్రతలో భాగంగా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు అవుతాయని తెలిపారు. గంజాయి నిర్మూలన ప్రచారంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా మహాత్మా సంతోష్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు పోలీస్‌లతో సహకరిస్తూ సమాజ పరిరక్షణలో తోడ్పాడాలని సూచించారు.



జైపూర్



లక్షెట్టిపేట

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



నవతెలంగాణ-హాజీపూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సంయుక్తంగా లయన్స్ ఐ హాస్పటల్ రేకుర్తి సౌజన్యంతో బుధవారం ముల్కల్లలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి చూపు లోపాలున్నవారికీ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికీ మందులు అందజేశారు. ఈ సందర్భంగా క్యాంపు చైర్మన్ డేగ బాపు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను గ్రామీణ ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. రెండు రోజుల పాటు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 22 మందికి కంటి ఆపరేషన్‌కు పంపనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్ కోసం రేకుర్తి కంటి ఆసుపత్రికి పంపనున్నట్లు వివరించారు. కంటి ఆపరేషన్ కోసం వెళ్లే వారికి, వారి సహాయకులకు ఉచితంగా బస్సు ప్రయాణం, కంటి ఆపరేషన్, భోజనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల ప్రెసిడెంట్ బాల్ మోహన్, గోల్డెన్ జూబ్లీ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, క్యాంప్ టెక్నీషియన్ రియాజ్, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కారోబారి సత్యం పాల్గొన్నారు.


మహిళలను వేధిస్తున్న నాయకులను కార్మికవర్గం క్షమించదు

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణిలో అధికారమధంతో మహిళలను వేధిస్తున్న నాయకులను కార్మికవర్గం క్షమించదని హెచ్ఎంఎస్ మందమర్రి బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ జే. శ్రీనివాస్ తెలిపారు. బ్రాంచ్ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ గోదావరిఖనిలో స్వప్న అనే సింగరేణి కార్మికురాలిపై అధికారమధంతో అసభ్యంగా తిడుతూ జుట్టు పట్టుకుని లాక్కొచ్చి రక్తంకారేలా కొట్టిన మడ్డి ఎల్లయ్యను తక్షణమే ఏఐటీయూసీ యూనియన్ నుంచి తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికురాల్లను చిన్నచూపు చూసి, చదువుకున్న చైతన్యవంతమైన మహిళలను బూట్లు కడగమని, గెస్ట్ హౌస్‌లలో పనులు చేయాలని, ఇండ్లలో పనిచేయాలని అధికారులకు కొమ్ముకాస్తూ గెలిచినమనే నాయకులను కార్మికవర్గం క్షమించదని తీవ్రంగా హెచ్చరించారు. మహిళా కార్మికులు మన బిడ్డల్లాంటి, అక్కచెల్లెలు లాంటి వారని అలాంటి వారిని వేధిస్తే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ పార్వతి రాజిరెడ్డి, కేంద్ర నాయకులు వెల్డి సుధర్శన్, ఎర్ర శ్రీనివాసరెడ్డి, ఏరియా నాయకులు ముఖేష్, థామస్, ప్రధీప్ పాల్గొన్నారు.



గంజాయి, డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత



నవతెలంగాణ-నస్పూర్

గంజాయి డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత అని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ శక్తియుక్తులను డ్రగ్స్ మాయలో పడి వృథా చేసుకోకూడదని ఒక్కసారి డ్రగ్స్ వాడినా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందన్నారు. సినిమాల్లో మాదకద్రవ్యాల వినియోగం అనేది యువత మనస్సులపై ప్రభావం చూపుతుందన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం ఒక సోషల్ స్టేటస్, ఫ్యాషన్‌గా బావిస్తున్నారని, ప్రస్తుతం యువత, విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అందమైన జీవితాన్ని గడపాలని అన్నారు స్కూల్స్, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్నా ఆ సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి అక్రమ రవాణా, సరఫరా, విక్రియంచే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని ఒక్కసారి కేసు నమోదు ఐనట్లయితే ఎలాంటి ఉద్యోగ అవకాశాలు రాక భవిష్యత్తు నాశనం అయి ఇబ్బంది పడవలసి వస్తుంది అని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ బంద్ ప్రశాంతం



నవతెలంగాణ-జన్నారం

సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు ఇచ్చినటువంటి తీర్పును వ్యతిరేకిస్తూ భారత్ బంద్‌లో భాగంగా మాలకుల సంఘం ఆధ్వర్యంలో జన్నారం మండలంలో, వర్గీకరణకు వ్యతిరేకంగా మాల కుల సంఘం ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. నేతకాని కులస్థులు నల్లబ్యాడ్జీలు ధరించి మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో దాముక కరుణాకర్, బెంజిమెన్, పాతబాలరాజ్, బండ దేవేందర్, జక్కులసురేష్, బోట్లసంజీవ్, భరత్ కుమార్, మగిడిప్రణవ్ పాల్గొన్నారు.

నస్పూర్ : ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఇచ్చిన భారత్ బంద్ లో భాగంగా మాల సంక్షేమ సంఘం గోసిక మనోజ్ కుమార్, కోర్ కమిటీ సభ్యులు గరిసె రామస్వామి ఆధ్వర్యంలో సీసీసీలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు అనే నిదానంతో బహుజనులందరూ ఐక్యతతో కలిసి ఉండాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ వర్గీకరణను ఆపకుంటే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు జువ్వాజి నందయ్య, దమ్మర్ల పెద్దమ్మయ్య, బాబురావు, ప్రచార కార్యదర్శి పండుగ శ్రీనివాస్, సుర్మిళ్ళ కిరణ్, భోగి నరహరి, బందెల సురేందర్, పీక శ్రావణ్, పండుగ శ్రీధర్, సుమన్, సోను, రిషి, దొంతమల్ల ప్రేమ్ సాయి, సంధి కృపాకర్, కిషోర్, వంజరి అభి పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలి



నవతెలంగాణ-జన్నారం

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయసాదనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి కోరారు. మండలంలోని కవ్వాల్ గౌడ సంఘం అధ్వర్యంలో కవ్వాల్ గ్రామంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముందుగా పాపన్న గౌడ్ విగ్రహానికి ఎస్ఐ రాజ వర్ధన్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను కలుపుకొని గోల్కొండను స్వాదీనం చేసుకొని పరిపాలన సాగించాడని అన్నారు. ఈ కార్యక్రమములో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మూల భాస్కర్ గౌడ్, కవ్వల గౌడ సంఘం ప్రెసిడెంట్ కాసరపు పోచా గౌడ్, బాలగౌడ్, తిరుపతి, నారాయణ, మల్లేష్, రవి, పోనకల్, పాడిటి సతీష్, ఒళ్ళాల నర్సాగౌడ్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా



నవతెలంగాణ-మందమర్రి

కేకే ఓసీపీలో పనిచేస్తున్న వోల్వో డ్రైవర్లు, బ్లాస్టింగ్ కార్మికుల వేతనాలు చెల్లించాలని జీఎం కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించి జీఎంకు వినతిపత్రం ఇచ్చారు. దూలం శ్రీనివాస్ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ సింగరేణి సంస్థకు ఓబీ కార్మికుల శ్రమతోనే రూ.వేల కోట్ల లాభాలు వస్తున్నాయని అయినా కార్మికులకు సమయానికి వేతనాలు ఇప్పించడంలో మాత్రం యజమాన్యం పూర్తి నిర్లక్ష్యాన్ని అవలంబిస్తుందన్నారు. ప్రతి నెల 7వ తేదిన వేతనాలు ఇవ్వాలని యాజమాన్యమే సర్కులర్ ఇచ్చినప్పటికీ, దాన్ని అమలు చేయడంలో అధికారులు పూర్తిస్థాయిలో విఫలం అవుతున్నారన్నారు. నెలంతా కష్టపడి పనిచేసినా వేతనాలు ఎప్పుడు పడతాయో తెలియని దుస్థితిలో సింగరేణి కాంటాక్ట్ కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబం, ఒకే లక్ష్యం, ఒకే గమ్యం అని నినాదం చేసే యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల విషయంలో మాత్రం ఎందుకు సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తుందని ప్రశ్నించారు.

పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ గుమ్మల జమున పెళ్లికి, గ్రామ సన్ రైజర్స్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం రూ.5116 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు మంతెన రాజశేఖర్ మాట్లాడుతూ జమున పెళ్లి ఈ నెల 23న ఉండడంతో, కడు దయనీయ స్థితిలో ఉన్న ఆ పేద కుటుంబాన్ని ఆదుకోవడానికి ఈ చిరు సాయం అందించామన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబానికి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో మంతెన రాజశేఖర్, ముమ్మడి హరికృష్ణ, మంతెన నగేష్, వొళ్ళలా సుదర్శన్ గౌడ్, శ్రీమంతుల వెంకటేష్, మంతెన కిష్టయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందేలా జిజ్ఞాస ప్రయోగాలు

నవతెలంగాణ-తాండూర్

విద్యార్థుల్లో విస్తృత ఆలోచనలు పెంపొందించేందుకే జిల్లా సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో జిజ్ఞాస ప్రయోగాలతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని జిల్లా స్థాయి జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్ సంపత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల మాదారం 3 విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మానవ శరీరంలో అంతర్గత అవయవాలపై, స్వయంగా ప్రయోగ పరికరాల ద్వారా ప్రయోగ నైపుణ్యాలను ఎలా పెంపొందించుకోవాలో తెలియజేశారు. ఒకటి నుండి ఏడవ తరగతి విద్యార్థులకు నిత్యాధార బోధనలతో ఆసక్తి పెంపొందించారు. అయస్కాంతం యొక్క ఆకర్షణ, లిట్మస్ పేపర్స్, సోలార్ వ్యవస్థ, పెరిస్కోప్ యొక్క ఉపయోగాలు కెలిడియోస్కు ఉపయోగాలను విద్యార్థులకి ప్రయోగపూర్వకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ ఉపాధ్యాయులు శేఖర్, కాకపతి పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | 22 ఆగస్టు, 2024 | www.navatelangana.com

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

నవతెలంగాణ-లక్షెట్టిపేట



తప్పిపోయిన అమ్మాయిని గుర్తించి వారి తల్లిదండ్రులకు బ్లూకోట్ పోలీసులు అప్పగించారు. వివరాలలోకి వెలితె సిరికొండ జాస్మిని తండ్రి సత్తయ్య రాపల్లి స్టేజి వద్ద తప్పిపోయి బస్సుఎక్కింది. అక్కడే ఉన్న పాప తల్లిదండ్రులు కాసేపటి వరకు పాప కన్పించక పోవడంతో పోలీస్ హెల్ప్‌లైన్ 100కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న లక్షెట్టిపేట బ్లూకోట్ సిబ్బంది సత్యనారాయణ, రాజు ప్రత్యేక చొరవతో పాపను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

మాతాశిశు ఆస్పత్రి తనిఖీ

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి మంచిర్యాల పట్టణ సీఐ బన్సిలాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా రాత్రి వేల మాత శిశు ఆవరణలో మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకులను, బయట మద్యం తాగి వచ్చి హాస్పిటల్ లో ఉన్న వారిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి బయటకు పంపించినట్లు తెలిపారు. అక్కడి సెక్యూరిటీకి తగిన సూచనలు చేశారు. ఆస్పత్రి ఆవరణలో మద్యం సేవించిన మద్యం తాగి లోపలికి ప్రవేశించిన వారి పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐ సనత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



నవతెలంగాణ-కాసిపేట

విద్యార్థుల హాజరు శాతం పెంచాలని డీఈఓ ఎస్ యాదయ్య సూచించారు. బుధవారం మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ తరగతులను పరిశీలించి పదవ తరగతి విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. పాఠశాలలో 58 మంది విద్యార్థులకు గాను 35 మంది విద్యార్థులు హాజరు కాగా పాఠశాల ఇన్‌చార్జిం ప్రధానోపాధ్యాయురాలు పుష్పలతను హాజరు శాతం పెంచాలని సూచించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని గూడెం గ్రామానికి చెందిన మర్రిపల్లి సత్తన్న అనారోగ్య కారణంతో ఇటీవల మరణించగా అతని కుటుంబానికి దండేపల్లికి చెందిన స్వచ్ఛంద సంస్థ అమ్మ ఫౌండేషన్ బాసటగా నిలిచింది. ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులతో పాటు రూ.5000 వేల ఆర్థిక సాయం అమ్మ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు కట్ట వెంకటేష్, గొల్ల రాజమల్లు, చెన్నవేని భాను ప్రసాద్, అల్లంల కుమారస్వామి, సుజాత అంకమల్ల శోభన, గడికొప్పుల వినోద్, గోపతి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత ప్రదర్శన



నవతెలంగాణ-దండేపల్లి

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని మేదరపేట గ్రామంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటపాటల ద్వారా ప్రభుత్వం పథకాలను ప్రజలకు తెలియజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాకాలం కావడంతో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డెంగ్యూ వ్యాధి బారిన పడకుండా ఉండాలని పాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు లావుడియా రమేష్, ముల్కల్ల మురళీ, శ్రీనివాస్, కిష్టయ్య, కృష్ణ, రవీందర్, సత్యనారాయణ, సంధ్య పాల్గొన్నారు.

వాస్తవ లాభాలు ప్రకటించి 35 శాతం వాటా ఇవ్వాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2023-24 గడిచి ఐదు నెలలు కావస్తున్నా సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు వాస్తవ లాభాలు ప్రకటించకపోవడం దుర్మార్గమని, ఏప్రిల్ 1వ తేదీన సీ అండ్ ఎండీ బలరాం నాయక్ గత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 70.02 ఉత్పత్తి గాను పూర్తిస్థాయిలో ఉత్పత్తి, ఉత్పాదకత సాధించామని పత్రికా పూర్వకంగా ప్రకటించిన ఇప్పటివరకు లాభాల వాటాను ప్రకటించడం లేదని తెలిపారు. యాజమాన్యం వాస్తవ లాభాలను ప్రకటించక ముందే సీఎస్ఆర్ నిధుల పేరిట రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లను వాడుకుంటుందని పేర్కొన్నారు. కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధులు, గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు స్పందించి వాస్తవ లాభాలను ప్రకటించి 35 శాతం వాటాతో పాటు ప్రతీ కార్మికునికి ఒక బంగారు నాణాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థినులకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎల్పిఓ గంగాధర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, వంట గది, సరుకులు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టి విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండే విధంగా చూడాలని వార్డెన్‌ను ఆదేశించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం, విద్యార్థినులకు మెనూ ప్రకారం అందిస్తున్న భోజనంపై హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయుల కొరతపై ఆరా తీశారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్, వార్డెన్ వనిత, పీడీ విశ్వనాథ్, ఉపాధ్యాయ సిబ్బంది శంకర్, ఉజ్వల ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించినపుడే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు.బుధవారం మండల కేంద్రంలోని మహాలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మొబైల్ ప్లానిటోరియం కార్యక్రమాన్ని జైపూర్‌లో మొదటిసారిగా ప్రారంభోత్సవం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ యొక్క మొబైల్ ప్లానిటోరియంలి పిల్లలకు వినోదం, విజ్ఞానం, టెక్నాలజీ వివిధ రూపాల్లో చూపెట్టడం జరుగుతుందన్నారు. ఇది రాష్ట్రంలోనే మొదటిసారిగా జైపూర్ మండల సమైక్య ఆధ్వర్యంలో రసంపల్లి గ్రామంలో ధనలక్ష్మి గ్రామ సంఘంలో సంతోషిమాత సంఘ సభ్యురాలు సుశీల వినూత్నంగా ఆలోచించి పిల్లలకు కొత్త టెక్నాలజీ ఇవ్వాలని బ్యాంకు లింకేజీ ద్వారా మొబైల్ ప్లానిటోరియం రూ.6 లక్షల వ్యయంతో నిర్వహించడం జరిగినదన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే విధంగా ఫిజికల్ ఫిట్నెస్ అందరూ ఉండాలని డిఫరెంట్‌గా ఆలోచించి రసూల్ పల్లిలో ఫిజికల్ జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికోసం రూ.6 లక్షలు వెచ్చించారని తెలిపారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మండల సమైక్య ప్రాంగణంలో పలు మొక్కలు నాటినారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

చికెన్‌గున్యాను జయించిన 30 రోజుల శిశువు

- ఉచితంగా చికిత్స చేసిన మల్లికార్జున పిల్లల ఆస్పత్రి యాజమాన్యం
- హైదరాబాద్‌లో ప్రత్యేక టెస్టు ద్వారా చికెన్‌గున్యాగా నిర్ధారణ
- వారం రోజుల చికిత్స తర్వాత కోలుకున్న శిశువు



నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలో 30 రోజుల మగ శిశువు చికున్ గున్యా జ్వరాన్ని జయించాడు. ప్రస్తుతం జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వైరల్ జ్వరాలతోపాటు డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వరబాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో శ్రీరాంపూర్‌కు చెందిన 30 రోజుల శిశువుకు పది రోజుల క్రితం జ్వరం రావడంతో తల్లిదండ్రులు బుద్దే సురేందర్‌లు వారం రోజుల క్రితం మంచిర్యాలలోని మల్లికార్జున పిల్లల ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు డాక్టర్ గోపతి శ్రీనివాస్ వర్మ చిన్నారి చర్మం ఊడిపోవడం గమనించాడు. వెంటనే ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్స ప్రారంభించాడు. జ్వర పరీక్ష కోసం బ్లడ్ శాంపిల్‌ను సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. స్థానికంగా 30 రోజుల వ్యాధి నిర్ధారించే అవకాశం లేకపోవడంతో హైదరాబాద్‌లో టెస్టు చేయించారు. అక్కడ చికున్‌గున్యా పాజిటివ్ వచ్చింది. సివియర్ స్టేజ్ కావడంతో చర్మం ఊడిపోతున్నట్లు గుర్తించాడు. దీంతో డాక్టర్ గోపతి శ్రీనివాస్ స్థానికంగానే ట్రీట్‌మెంట్ చేశాడు. నాలుగు రోజుల చికిత్స తర్వాత శిశువు ఆరోగ్యం మెరుగపడింది. ప్రస్తుతం పూర్తిగా కోలుకుంది. దీంతో శిశువు తల్లిదండ్రులు డాక్టర్‌కు కృతజ్ఞతులు తెలిపారు. తమకు ఎలాంటి ఫీజు తీసుకోకుండాడ తమ బిడ్డకు ప్రాణం పోసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న పిల్లలో చికున్‌గున్యా అరుదుగా వస్తుందని, దానిని నిర్ధారించే సదుపాయం స్థానికంగా అందుబాటులో లేదని తెలిపారు. అందుకే హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించి చికిత్స చేయించామని తెలిపారు. పేద కుటుంబం కావడంతో చికిత్స పూర్తిగా ఉచితంగా అందించామని, శిశువు పూర్తిగా కోలుకుందని పేర్కొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి





నవతెలంగాణ-జన్నారం

యువత మారకద్రవ్యాలకు అవాటు కావద్దని ఎస్ఐ రాజ వర్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని హాస్టల్ తండాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మంచి అవాట్లు చేసుకోవలని వ్యసనాలకు భానిసై జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

వేమనపల్లి : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ అన్నారు. మంగళవారం వేమనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రహరి కమిటీ ఏర్పాటు చేసి విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యసనం ఒక ప్రాణాంతక వ్యాధని, వ్యసనపరులు దీర్ఘకాలం పాటు దానికి బానిసై తమ ఉనికిని కోల్పోతున్నారని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడే యువత శారీరక రుగ్మతలకులోనై, జ్ఞాపకశక్తి కోల్పోయి, విచక్షణ, విజ్ఞత కోల్పోయి నేరాలకు పాల్పడుతూ దురదృష్టవశాత్తు కేసుల్లో నిందితులుగా మారుతున్నారని తెలిపారు. మాదకద్రవ్యాలు వినియోగించడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని అన్నారు.

రిమ్స్ కార్మికులకు పెండింగ్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ కార్మికులకు పెండింగ్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రిమ్స్ బ్రాంచ్ అధ్యక్షురాలు సంగీత అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రిమ్స్ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. గత కాంట్రాక్టర్ ఇవ్వాల్సిన ఐదు నెలల పెండింగ్ ఎరియర్స్ సాధించుకోవడం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. పెండింగ్ ఎరియర్స్ విషయమై డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ దృష్టికి అనేక మార్లు తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించి ఇప్పించే ప్రయత్నం చేస్తానని చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ పని జరగలేదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ ఎరియర్స్ చెల్లించేలా సదరు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్మికుల ఖాతాల్లో ఆ డబ్బులు జమ చేయించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధతం చేస్తామని హెచ్చరించారు.

వ్యభిచార దందా గుట్టురట్టు

- మహిళతో పాటు ఆరుగురు విటుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కన ఉన్న ఓ ప్రయివేటు గెస్ట్ హౌస్‌లో వ్యభిచారం చేస్తున్న ఆరుగురి విటులతో పాటు ఓ మహిళ, వ్యభిచార నిర్వాహకుడు శంకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్ తెలిపారు. బుధవారం ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం రాత్రి గెస్ట్ హౌస్‌లో వ్యభిచారం నడుస్తుందని నమ్మదగిన సమాచారం మేరకు సీఐ బన్సీలాల్ తోపాటు, సిబ్బందితో కలిసి రైడింగ్ చేయడం జరిగిందన్నారు. గెస్ట్ హౌస్‌ను చున్నంబటీ వాడకు చెందిన కరుణాకర్ లీజుకు తీసుకొని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలకు షార్ట్ ఫిలిం చేయడం ద్వారా అధిక సొమ్మును పొందవచ్చని ఆశ చూపించి వారిని మభ్యపెట్టి ఈ వృత్తిలోకి లాగుతున్నట్లు తెలిపారు. శంకర్ గతంలో ఒక లాడ్జిలో పనిచేసిన అనుభవం ఉండడంతో, కరుణాకర్ ఈవెంట్ మేనేజర్‌గా వ్యవహరిస్తూ వ్యభిచారం నడిపిస్తున్నట్లు తెలిపారు. శంకర్ వాట్సాప్ గ్రూప్ ద్వారా మంచిర్యాల, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, మందమర్రి, చెన్నూర్‌కు చెందిన విటులకు అందమైన అమ్మాయిల ఫోటోలు పంపించి ఈ వ్యవహారం నడిపిస్తున్నాడు. విటుల నుంచి రూ.2000 తీసుకొని అమ్మాయికి రూ.1000 చొప్పున ఇస్తూ ఈ దందా సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి ఒక మహిళను పిలిపించి మంగళవారం గ్రూప్ ద్వారా అమ్మాయి ఫోటో పంపడంతో వారు వచ్చారని, బెల్లంపల్లికి చెందిన కొబ్బరి నవీన్, దేవ పోచమల్లు, రామకృష్ణాపూర్‌కు చెందిన గండి రమేష్, మంచిర్యాల పట్టణం హమాలివాడకు చెందిన కొలిపాక రాజశేఖర్, సీసీసీ నస్పూర్ చెందిన గొల్లపల్లి శేఖర్, వీరితోపాటు వ్యభిచారం నిర్వాహకుడు శంకర్లను అదులోకి తీసుకోవడం జరిగిందని, వారి వద్ద నుంచి సెల్ ఫోన్‌లు, నగదు రూ.15వేల, రెండు ద్విచక్ర వాహనలు స్వాధీన పరుచ్చుకున్నట్లు తెలిపారు. ఈవెంట్ ఆర్గనైజర్ కరుణాకర్ పరార్‌లో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచనున్నట్లు తెలిపారు.



వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

- ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-జైపూర్

వ్యక్తి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. భీమారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఆయన పర్యటించి పలు కాలనీలను పరిశీలించారు. కాలనిలో ఉన్న మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న యాదవ సంఘం భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం విద్యను అందించాలని సూచించారు. అనంతరం కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి ఆయా పాఠశాలల్లో 8, 9 తరగతులకు డిజిటల్ తరగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరేణిలో కుంటుపడుతున్న క్రీడా విభాగం

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో క్రీడా విభాగం కుంటుపడుతుందని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కార్పొరేట్ విభాగంలో ఇద్దరు సూపర్‌వైజర్లు ఉండి క్రీడల షెడ్యూలు, క్రీడా పోటీలను సకాలంలో నిర్వహించి క్రీడాకారులను, కలకారులను ప్రోత్సహించేవారని, గత సంవత్సరం ఒక సీనియర్ సూపర్‌వైజర్ పదవీ విరమణ కావడంతో ప్రస్తుతం ఉన్న ఒక్క సూపర్ వైజర్ వైఫల్యంతో క్రీడా వ్యవహారాలు కుంటుపడుతున్నాయని పేర్కొన్నారు. గత సంవత్సరం నుంచి క్రీడా దుస్తులను ఇప్పటివరకు ఏరియాల వారిగా అందజేయకపోవడం, కోల్ ఇండియా క్రీడల షెడ్యూలు కోల్ కత్తా హెడ్ ఆఫీస్ నుంచి గత మూడు నెలల క్రితమే సింగరేణి యాజమాన్యంకు అందినప్పటికి, 2024-25 సింగరేణి వార్షిక క్రీడల నిర్వహణ షెడ్యూలు ఇప్పటికీ ప్రకటించక పోవడానికి కార్పొరేట్ విభాగంలో మరొక సూపర్‌వైజర్ నియమించక పోవడమే నన్నారు. వెంటనే క్రీడా యూనిఫార్మ్, మెటీరియల్స్ కొనుగోలుతో పాటు, క్రీడల నిర్వహణ, మొదలగు కార్యక్రమాలను సకాలంలో నిర్వహించి క్రీడాకారులను, కళా కారులను ప్రోత్సహించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

మందులు అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-జైపూర్

ఆరోగ్య కేంద్రాల పరిదిలో ఆశా కార్యకర్తల వద్ద అన్ని రకాల మందులు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి హరీష్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అకస్మికంగా సందర్శించి నాయన రికార్డులు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో నమోదు అవుతున్న జ్వరాలు వ్యాధులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జ్వరాలు ప్రబలకుండా గ్రామపంచాయతీ, ఐసీడీఎస్‌ల సమన్వయంతో జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. కీటక జనిత వ్యాధులైన చికెన్ గునియా, డెంగ్యూ జ్వరాల నిర్మూలనకు దోమల వ్యాప్తిని అరికట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫయాజ్, డాక్టర్ అనిల్, డాక్టర్ ముస్తఫా పాల్గొన్నారు.

మెడికల్ ఇన్‌వాలిడేషన్ డిపెండెంట్ల నియామకం

నవతెలంగాణ-మందమర్రి

జీఎం కార్యాలయంలో 14 మంది మెడికల్ ఇన్ వాలిడేషన్ డిపెండెంట్లకు బుధవారం ఏరియా జీఎం దేవేందర్ కారుణ్య నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏరియాలో ఇప్పటివరకు కారుణ్య నియామకాల ద్వారా 1878 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇతర పరిశ్రమలతో పోలిస్తే సింగరేణిలో పని స్థలాలు సమయాలు భిన్నంగా ఉంటాయని విధులకు గైర్హాజరు అయితే ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని కష్టపడి పనిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సీఎంఓ ఏఐ ప్రెసిడెంట్ పైడిశ్వర్, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డీవైపీఎం సత్య బోస్, రాజలింగు(ఒఎస్), ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వయ్యారి భామ కలుపును అరికట్టాలి



నవతెలంగాణ-తాండూర్

పంటలకు, పర్యావరణానికి హాని కలిగించే వయ్యారి భామ కలుపు మొక్కను రైతులు సమూలంగా నాశనం చేయాలని పొలాస వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు తెలిపారు. బుధవారం బెల్లంపల్లి మండలం అకెనెపల్లిలో వయ్యారిభామ కలుపు మొక్క వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి రైతులకు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి ఆదేశానుసరం పొలాస వ్యవసాయ విద్యాలయానికి చెందిన ఐదుగురు విద్యార్థులకు ఆర్ఎడబ్ల్యూ ఏపీ ప్రోగ్రామ్ కింద అకెనపల్లి గ్రామాన్ని ఎన్నుకున్నారు. విద్యార్థులు అకెనపల్లిలోనే ఐదు నెలలు ఉంటారు. రైతులతో మమేకమై వ్యవసాయ మెళకువలు తెలుసుకుంటారు. బుధవారం వయ్యారి భామ కలుపు మొక్క నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు ఈ మొక్క మనుషులు, పశువులలో శ్వాస, చర్మ సంబంధిత జబ్బులు కల్గజేస్తుందని తెలిపారు. పంట దిగుబడిని 40-50శాతం తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం


తలమడుగు


లోకేశ్వరం

నవతెలంగాణ-తలమడుగు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్ పిలుపుమేరకు బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో స్వచ్ఛందంగా వ్యాపారస్తులు మూసివేసి, భారత్‌బంద్‌కు సహకరించారు. మండల మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు క్రాంతి కుమార్ మాట్లాడుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో వివిధ గ్రామాలతో పాటు మండలాల నుంచి వచ్చిన మాల ఉపకులాలు పెద్ద ఎత్తున ప్రధాన వీధుల గుండా బైక్‌ర్యాలీ ప్రశాంతంగా నిర్వహించినట్టు తెలిపారు. ఆర్టికల్ 341 ప్రకారం మాత్రమే రాజ్యాంగ సవరణ చేసి, పార్లమెంట్‌లో చట్టం తేవాలి కానీ కేవలం రాజకీయ లబ్ధి కోసమే వర్గీకరణ చేశారని తెలిపారు. ఇది కేవలం దళితుల మధ్య చిచ్చు పెట్టడమేనని అన్నారు. కేవలం రాజకీయ పబ్బం కోసం మాత్రమే వర్గీకరణ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాల సంఘం నాయకులు దేవన్న, శ్రీనివాస్, ఆనంద్, అడెల్లు, విష్ణువర్ధన్, సూర్య ప్రకాష్, దేవన్న, రాకేష్, రమేష్, దేవిదాస్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాల సంఘ నాయకులు, ఉపకులాల నాయకులు పాల్గొన్నారు.

లోకేశ్వరం : ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు బుధవారం చేపట్టిన భారత్‌బంద్ మండల కేంద్రంలో ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం నుంచి ఎస్సీ వ్యతిరేక వర్గీకరణ కమిటీ సభ్యులు ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలను దగ్గరుండి బంద్ చేయించారు. వర్తక, వాణిజ్య వ్యాపారాల


ఆదిలాబాద్ టౌన్

వారు స్వచ్ఛందంగా బందుకు మద్దతు తెలిపారు.

ఉట్నూర్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన భారత్‌బంద్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలో ఉదయం నుంచే వ్యాపారస్తులు, ప్రయివేట్ పాఠశాలలు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాల, నేతకాని సంఘాల నాయకులు పట్టణంలో తిరుగుతూ బంద్‌కు సహకరించాలని కోరారు. దీంతో మండల కేంద్రం నిర్మానుశ్యంగా మారింది. మాల మహానాడు, జాతీయ ప్రధాన కార్యదర్శి డి.ప్రభాకర్ మాట్లాడుతూ కలిసి ఉన్న దళితులకు వర్గీకరణ పేరుతో విడగొట్టరాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నార్నూర్ : సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును రద్దు చేయాలని, దళిత సంఘాల నాయకులు లోఖండే చంద్రశేఖర్, దుర్గె కాంతారావ్ ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం భారత్‌బంద్‌లో భాగంగా మండల కేంద్రంలో సంపూర్ణంగా బంద్ పాటించారు. గాంధీచౌక్ వద్ద ధర్నా చేసి అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వర్గీకరణను రద్దు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజలింగంను వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు ప్రకాష్, మానే సంతోష్, ఝాడె లింగోరావ్, కే నరహరి, కే సుభాష్, నాందేవ్, మాణిక్ రావ్, బారిక్‌రావ్ ఉన్నారు.

తాంసి : డాక్టర్.బీఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లు కొనసాగాలని కోరుతూ బుధవారం తాంసి మండల కేంద్రంలో మాల సంక్షేమ సంఘం మండల కార్యవర్గం ఆధ్వర్యంలో భారత్‌బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామంలోని దుకాణాలను హోటళ్లను బంద్ చేయించారు. మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలన్న తీర్పును వెనక్కి తీసుకొని రాజ్యాంగ బద్ధంగా కొనసాగుతున్న ఎస్సీ రిజర్వేషన్లను కొనసాగించాలని కోరారు. మాల కులాల్లో నిరుపేదలు ఉన్నామన్నారు. ఎస్సీ వర్గీకరణతో మరింత నిరుపేదలు చదువుకు, ఉద్యోగాలకు దూరం అవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాటిల్ సృజన్, గంగాధర్, అశోక్, భూమన్న, ప్రకాష్, మాల సంక్షేమ సంఘం సభ్యులు ఉన్నారు.


నార్నూర్


తాంసి




ఆదిలాబాద్ టౌన్

నిషేధిత గుట్కా పట్టివేత

నవతెలంగాణ-బోథ్

మండలంలోని గుట్టపక్క తండా గ్రామానికి చెందిన చంబర్ సుభాష్ నిషేధిత గుట్కా మహారాష్ట్ర నుంచి సొనాలకు తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్టు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. పట్టుకున్న గుట్కా విలువ రూ.28వేల 264 ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన ఇద్దరి అరెస్ట్

నవతెలంగాణ-బోథ్

చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన ఇద్దరిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేసినట్టు సీఐ బి.రమేష్, ఎస్సై ఎల్.ప్రవీణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన సిరిపురం రవికుమార్, ఉడుత గంగాధర్, చిట్టీల పేరుతో అమాయక ప్రజలను మోసం చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.2కోట్లకు పైగా చిట్టీల పేరుతో వసూలు చేసి, టోకరా కొట్టి మోసం చేసి, పలు కుటుంబాలను రోడ్డు పాలు చేసి, తప్పించుకొని తిరుగుచుండగా వారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. అలాగే ఇలాంటి మోసగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సెప్టెంబర్ 21న పంచాయతీల్లో ఓటరు తుది జాబితా

నవతెలంగాణ-హాజీపూర్

పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 21వ తేదీన తుది ఫోటో ఓటరు జాబితాలు సిద్దం చేసి ప్రదర్శించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారధి బుధవారం ఉత్తర్వులు చేశారు. ఇక జిల్లా వ్యాప్తంగా ఉన్న 311 గ్రామ పంచాయతీల్లో సెప్టెంబర్ 21వ తేదీ ఫోటో ఓటరు జాబితా సిద్ధం చేసి కార్యాలయాల ఆవరణలో ప్రదర్శించాలని సూచించారు. ఈ మేరకు సెప్టెంబర్ 6న అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులతో సమావేశం, 9న జిల్లా ఎన్నికల అధికారుల సమావేశం, 10న ఎంపీడీఓ, ఎంపీఓ, కార్యదర్శులతో మండల స్థాయిలో సమావేశాలు, 13వ తేదీ వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 19న డీపీఓ ద్వారా అభ్యంతరాల పరిశీలన, తొలగింపు అనంతరం 21వ తేదీన పంచాయతీల్లో వార్డుల వారిగా ఫోటో ఓటరు జాబితా ప్రదర్శించాలని సూచించింది.

ఉద్యోగులపైనే సింగరేణి భవిష్యత్తు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి భవిష్యత్తు నూతన ఉద్యోగులపై ఉందని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ అన్నారు. కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నియామకం పొందిన 7 మంది యువకులకు శ్రీనివాస్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, దక్షిణ భారతదేశంలోనే సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. అలాగే తమ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ, క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని, సింగరేణిని లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో 3437 కారుణ్య నియామక పత్రాలను జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవింద రావు, సీనియర్ పీఓ కాంతారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

సవాలును స్వీకరించని కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

సంపూర్ణ రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తూ ప్రశ్నించే రైతులపై కేసులు పెట్టించి, భయాందోళనకు గురి చేస్తుందనిబోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో బీఆర్ఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణంగా కాలేదని, సవాలు విసిరామని తెలిపారు. సంపూర్ణ రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం వేసినట్లయితే తలమడుగు మండల కేంద్రంలోని రైతు వేదికలో 22న అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని, ఈ సమావేశానికి మీరు సిద్ధమా అంటూ సవాలు చేశామని తెలిపారు. ఈ సవాలును కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వీకరించని కారణంగా, అఖిలపక్ష సమావేశాన్ని రద్దు చేస్తున్నట్టు తెలిపారు. అంతేకాదు ఈ సవాలును కాంగ్రెస్ నాయకులు స్వీకరించి తేదీ, సమయం, స్థలం చెబితే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి బీఆర్ఎస్ మండల శాఖ సిద్ధంగా ఉంటుందని ఒక ప్రకటనలు తెలిపారు.